





హే భగవాన్!

- ఆలయాల్లో వరుస చోరీలు
- ఊరికి దూరంగా ఉన్నవే టార్గెట్
- సీసీ కెమెరాల ధ్వంసం
- బంగారం, వెండి ఆభరణాలు అపహరణ
- పోలీసులకు సవాల్‌గా మారిన దొంగలు



● ఈ నెల 17న పొందూరు మండలం **నందివాడలోని బాలయోగి ఆశ్రమంలో** చోరీ జరిగింది. అర్ధరాత్రి దుండగులు ప్రవేశించారు. రెండు తులాల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలతో పాటు హుండీలో లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్టు ఆశ్రమ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

● జూలై 16న పాతపట్నం మండలం **కాగువాడ త్రిపుర సుందరి దేవి ఆలయంలో** దొంగలు పడ్డారు. సీసీ కెమెరాల కనెక్షన్లు తొలగించి లోపలికి ప్రవేశించారు. రెండు హుండీల్లోని నగదుతో పాటు అమ్మవారికి అలంకరించిన బంగారం, వెండి ఆభరణాలను అపహరించారు. మూడు కేజీల వెండి, రూ.50 వేల నగదు పోయిందని పోలీసులకు ఆలయ కమిటీ ఫిర్యాదు చేసింది.

ఎన్నో ఘటనలు..

● ఈ ఏడాది ఏప్రిల్ 2న వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురంలోని అయ్యప్పస్వామి, శివాలయాల్లో చోరీలు జరిగాయి. ఈ రెండు ఆలయాల్లోనూ సీసీ కెమెరాలు ధ్వంసం చేసి.. విగ్రహాలపై ఉన్న బంగారు, వెండి వస్తువులను దొంగలు అపహరించారు. సుమారు రూ.11 లక్షల వరకూ దోచేశారని అర్చకులు, గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● ఏప్రిల్ 25న ఎచ్చెర్ల మండలం కుంచాలకురమయ్యపేటలోని శ్రీచక్రాలయంలో భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి ఆలయం లోపలికి ప్రవేశించిన ఆగంతకులు వంద తులాల వరకూ వెండి వస్తువులను పట్టుకుపోయారు. వాటి విలువ రూ.40 లక్షలు ఉంటాయని పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కర శర్మ తెలిపారు. హుండీలను పట్టుకుపోయి సమీప పొలాల్లో పడేశారు. సీసీ కెమెరాలు సైతం ఎత్తుకుపోవడంతో పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది.

● జూన్ 28న పాతపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. విగ్రహాల వద్ద ఉన్న కిలో వెండి సామగ్రితో పాటు హుండీలోని రూ.50 వేల నగదును ఆగంతకులు పట్టుకుపోయారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

(రణస్థలం)

జిల్లాలో ఇటీవల దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఇప్పటివరకూ ఎవరూ లేని ఇళ్లే లక్ష్యంగా చేసుకొని దొంగలు రెచ్చిపోయేవారు. ఇప్పుడు ఆలయాలపై పడ్డారు. రాత్రివేళల్లో చోరీలకు పాల్పడుతున్నారు. దేవుడి విగ్రహాలపై ఉన్న బంగారం, వెండి ఆభరణాలను దోచుకుపోతున్నారు. హుండీలను పగులగొట్టి నగదుతో పరారవుతున్నారు. జిల్లాలో పురాతన దేవాలయాలు ఎన్నో ఉన్నాయి. భక్తులు ఎంతో నమ్మకంతో, భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. ఇటువంటి చోట్ల నేడు భద్రత కరువైంది. గ్రామాలకు దూరంగా, నిర్మానుష్య ప్రాంతాల్లో ఉండే ఆలయాలనే దొంగలు టార్గెట్ చేసుకుంటున్నారు. అర్ధరాత్రి వేళ గేట్లు, తలుపులు, హుండీలు పగులకొడుతున్నారు. కొన్నిచోట్ల హుండీలను ఎత్తుకెళ్లి దూరంగా ఉన్న పొలాలు, తోటల్లో పడేస్తున్నారు. దేవదాయ శాఖ, పోలీస్ శాఖలు సంయుక్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. వాటిని సైతం ధ్వంసం చేస్తున్నారు. తర్వాత దొంగతనం చేసి సొత్తుతో పరారవుతున్నారు.

● నాటి ఘటనతో..

వైసీపీ హయాంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం రామతీర్థం దేవస్థానంలో విగ్రహాల ధ్వంసం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో ఆలయాల భద్రత ప్రశ్నార్థకమైంది. ముప్పేట విమర్శలు రావడంతో అప్పట్లో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలతో పాటు స్థానికుల ఆధీనంలో ఉండే ఆలయాల్లో సైతం ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. అయితే అప్పట్లో కొన్నిచోట్ల మాత్రమే ఏర్పాటు చేశారు. జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో 772 దేవాలయాలు ఉన్నాయి. ఈవోల పర్యవేక్షణ ఉన్న దేవాలయాలు 80. మరో 139 ఆలయాల్లో దేవదాయ శాఖ దూపదీప నైవేద్యాలను అందిస్తోంది. అయితే స్థానికుల చేతిలో నడుస్తున్న చాలా దేవాలయాల్లో సీసీ కెమెరాలు అమర్చలేదు. ముఖ్యంగా ఊరికి దూరంగా ఉండే అమ్మవారి ఆలయాలను, కొండపై ఉండే ఆలయాలను దొంగలు టార్గెట్ చేస్తుండడం గమనార్హం.



● ఈ నెల 15న ఎచ్చెర్ల మండలం **ఫరీదుపేటలోని రంగనాథ ఆలయంలో** చోరీ జరిగింది. 7 తులాల బంగారం, మూడు కిలోల వెండి, హుండీలోని రూ. లక్ష రూపాయలను అపహరించుకు పోయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఊరికి దూరంగా ఉన్న ఈ ఆలయాన్ని గ్రామస్థులు, దాతలు ఇటీవల పునర్నిర్మించారు.

ఇవి చేయడం మంచిది

● ఆలయాల్లో తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డ్స్‌ను నియమించుకోవాలి. ● ఆలయాలను మూసివేసినప్పుడు తాళాలు సక్రమంగా వేశారో లేదో చూసుకోవాలి. ● నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి లైట్లు వేసి ఉంచాలి. ● పోలీసుల బీట్ బుక్‌ను ఏర్పాటు చేయించుకోవాలి. ● ఆలయ ఆవరణలో పెంపుడు కుక్కలను పెంచుకుంటే చాలా మంచిది.

అప్రమత్తంగా ఉన్నాం

ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేశాం. నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కూడా చెప్పాం. ఇప్పటికే స్థానికుల చేతుల్లో నడుస్తున్న ఆలయాల్లో కూడా నిఘా కెమెరాలు ఏర్పాటు చేయించాం. చోరీల నియంత్రణతో పాటు విధ్వంస ఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉన్నాం.

-ప్రసాద్ పట్నాయక్, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయ శాఖ


దృష్టి సారించాం

ఆలయాల్లో చోరీల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆలయాల్లో చోరీలను అరికట్టేందుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి.. జేఆర్ పురం సీఐ అవతారం ఆధ్వర్యంలో.. అనుభవం ఉన్న 8మంది పోలీస్ అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఇప్పటికే అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. ఆలయ కమిటీలు, గ్రామపెద్దలతో సమావేశమై.. సలహాలు, సూచనలు అందించాం. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే 100కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించాం.


-వివేకానంద్, డీఎస్పీ, శ్రీకాకుళం

సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

● వాతావరణం అనుకూలించక పోవడమే కారణం
● 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం వాయిదా



శ్రీకాకుళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రద్దయింది. కూటమి ప్రభుత్వం కొలువుతీరాక.. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటించేందుకు ముందుగా షెడ్యూల్ ఖరారైంది. 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం రాజపురంలో నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారితో సీఎం మాట్లాడాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే బెందాళం అశోక్ పరిశీలించారు. గురువారం ఉదయం హెలీప్యాడ్ వద్దకు చేరుకుని.. అధికారులకు పలు సూచనలు చేశారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గురువారం సాయంత్రం జిల్లాలో వర్షం కురిసింది. శుక్రవారం కూడా వాతావరణం అలానే ఉంటుందని.. సమాచారం అందింది. హెలీకాప్టర్‌లో పయనించేందుకు వాతావరణం అనుకూలించదని అధికారులు నివేదించారు. దీంతో ముఖ్యమంత్రి పర్యటన రద్దయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం వాయిదా పడిందని వెల్లడించారు.



గొట్టాబ్యారేజీ నుంచి వృథాగా పోతున్న నీరు



వంశధార ప్రధాన ఎడమ కాలువ

వంశధార-బాహుదా

నదుల అనుసంధానంపై ఆశలు

- నాడు టీడీపీ హయాంలో రూ.6,400 కోట్లతో టెండర్లు
- రద్దు చేసిన గత వైసీపీ ప్రభుత్వం
- సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించాలని ఉద్దానం రైతుల విజ్ఞప్తి

(టెక్కలి)

వంశధార-బాహుదా నదుల అనుసంధానంపై ఉద్దానం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వంశధార నది నుంచి వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసేలా నదుల అనుసంధానం చేయాలని టీడీపీ హయాంలో (2014-19 మధ్య) అప్పటి సీఎం చంద్రబాబు నిర్ణయించారు. జిల్లాలో 110 కిలోమీటర్లు నిడివిగల ఈ రెండు నదులను అనుసంధానం చేసి.. 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని భావించారు. ఇందుకు సంబంధించి 2018లో రూ.6,400కోట్ల మేర నిధులు కేటాయించి.. టెండర్ల ప్రక్రియ చేపట్టారు. అప్పట్లో బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. అందులో భాగంగా వీటి తనిఖీకి సంబంధించి టీడీపీ ప్రభుత్వం రూ.5కోట్ల నిధులను సైతం కేటాయించింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు సమీపించగా.. వైసీపీ అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 25 శాతం లోపల జరిగిన పనులన్నీ రద్దు చేస్తున్నామని ప్రకటించింది. దీంతో వంశధార, బాహుదానదుల అనుసంధానానికి మంగళం పాడేసింది.

గత ఐదేళ్లూ.. ప్రస్తావనే లేదు

ఏటా సుమారు 200టీఎంసీల నీరు వంశధార నది ద్వారా సముద్రంలో వృథాగా కలుస్తోంది. దీంతో ఎలాగైనా ఇంటర్‌లింకింగ్ ద్వారా తక్కువ నీటివనరులు గల బాహుదా నదికి కలపాలన్న టీడీపీ ప్రయత్నాలను వైసీపీ ప్రభుత్వం నీటిపాలు చేసింది. వంశధార, బాహుదా నదులు అనుసంధానం చేస్తే పాతపట్నం, మెళియాపుట్టి, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో సుమారు 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. ఈ నదులు అనుసంధానం చేయాలని కోరుతూ టెక్కలి, పలాస డివిజన్లకు చెందిన ఎంతోమంది ప్రజాప్రతినిధులు కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి నిధులు కేటాయిస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని తుంగలోకి తొక్కింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రజాప్రతినిధులు.. అప్పటి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం టీడీపీ నాయకులు, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నర్తు రామారావు యాదవ్ వంటి నాయకులు.. జగన్‌మోహన్‌రెడ్డి వద్ద కనీసం ఈ అంశం ప్రస్తావించలేకపోయారు. దీంతో నదుల అనుసంధానం పనుల్లో కదలిక లేదు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతపట్నం వచ్చిన చంద్రబాబునాయుడు వంశధార-బాహుదా నదుల అనుసంధానానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. నదుల అనుసంధానంపై సీఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఉద్దానం రైతులు కోరుతున్నారు.

ఎక్సైజ్‌శాఖలో బదిలీల హడావుడి

● నేటితో దరఖాస్తు గడువు సరి

పొందూరు, సెప్టెంబరు 19: ఎక్సైజ్‌శాఖలో బదిలీలలకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ)ని రద్దు చేసి ఎక్సైజ్‌శాఖలో కలిపేసింది. నూతన మద్యం పాలసీ అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈలోగా బదిలీల ప్రక్రియకు సంబంధించి బుధవారం రాత్రి జీవోనెంబరు 75, 76 జారీ చేసింది. ఈ నెల 20లోగా కిందిస్థాయి సిబ్బంది (కానిస్టేబుల్) నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకూ బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. దరఖాస్తు చేసుకునే ఉద్యోగులు ఐదు ఆప్షన్లు ఇచ్చింది. దీంతో ఎక్సైజ్‌శాఖలో హడావుడి ప్రారంభమైంది. ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ, ఎస్ఐతో పాటు తొమ్మిది మంది కానిస్టేబుల్స్ ఉంటారు. వారంతా తమకు కావాల్సిన స్టేషన్లకు బదిలీ చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా ఈ బదిలీ ప్రక్రియ పూర్తి కానుండడంతో దరఖాస్తుకు ముందే సిఫార్సు లేఖలు తీసుకువస్తున్నారు.

గుండ అప్పల సూర్యనారాయణకు అస్వస్థత



(ఫైల్)

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 19: నాలుగు దశాబ్దాల పాటు నిస్వార్థ రాజకీయాలకు చిరునామాగా నిలిచిన మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఆదివారం అర్ధరాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళవారం విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. ఆయన బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టిందని వైద్యులు గుర్తించి.. బుధవారం ఆపరేషన్ చేశారు. త్వరలోనే ఆయన కోలుకుంటారని అప్పలసూర్యనారాయణ భార్య, మాజీఎమ్మెల్యే లక్ష్మీదేవి తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్ వాయిదా

అరసవల్లి, సెప్టెంబరు 19: శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించాల్సిన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం కొన్ని కారణాల వలన రద్దయిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 27కి వాయిదా వేశామన్నారు.



పొందూరులో 'నీరు-చెట్టు' పనులు (ఫైల్)

ఎట్టకేలకు..

● 'నీరు-చెట్టు' పనుల బకాయిలు విడుదల

(పొందూరు)

'నీరు-చెట్టు' పనుల బకాయిల నిధులు ఎట్టకేలకు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో రూ.30కోట్ల మేర బకాయిలు ఉండగా.. ప్రస్తుతానికి ప్రభుత్వం రూ.7కోట్లు విడుదల చేసింది. దీంతో బకాయిల కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న టీడీపీ నాయకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో.. జలవనరుల అభివృద్ధికి ప్రతిష్ఠాత్మకంగా 'నీరు-చెట్టు' పనులు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సమయానికి ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.50కోట్లు మేర బిల్లుల బకాయిలు ఉండిపోయాయి. తర్వాత 2019లో వైసీపీ అధికారంలోకి రాగా.. 'నీరు-చెట్టు' పనుల బిల్లులను చెల్లించకుండా వేధింపులకు గురిచేసింది. దీంతో అప్పట్లో అప్పు చేసి.. పనులు చేపట్టిన టీడీపీ నాయకులు ఆర్థికంగా మరింత ఇబ్బందులు పడ్డారు. బకాయిలపై వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. బకాయిలు చెల్లించాలని కోర్టు ఆదేశించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో సంబంధిత అధికారులపై కోర్టు ధిక్కరణ నేరం కింద మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం రూ.20కోట్ల వరకూ చెల్లించింది. మిగిలిన రూ.30కోట్ల బకాయిలను చెల్లించకుండా.. ఐదేళ్లుగా తాత్సారం చేసింది. మొన్న సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా.. తాము అధికారంలోకి వస్తే 'నీరు-చెట్టు' బకాయిలు విడుదల చేస్తామని చంద్రబాబు హామీఇచ్చారు. ఈ మేరకు ప్రస్తుతం తొలివిడతగా రాష్ట్రవ్యాప్తంగా రూ.259 కోట్లు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.7కోట్లు కేటాయించారు. మిగిలిన బకాయిలు కూడా త్వరలో విడుదల చేయనున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. దీంతో టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శ్రీకాకుళం ఇరిగేషన్ ఎస్ఈ పి.సుధాకరరావు వద్ద ప్రస్తావించగా.. ప్రస్తుతం విడుదల చేసిన రూ.7కోట్ల నిధులను.. బకాయిల ఆధారంగా పనులు చేసిన వారికి చెల్లిస్తామని తెలిపారు.

ఇబ్బందులు పడ్డాం



గ్రామంలో నీరు-చెట్టు పనులు చేశాం. సుమారు రూ.10లక్షలు బకాయిలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపుతో బకాయిలు విడుదల చేయకపోవడంతో.. అప్పులకు వడ్డీ కట్టడానికి ఇబ్బందులు పడ్డాం.

- పప్పల వేణుగోపాలరావు, సర్పంచ్, టీడీపీ నాయకుడు, తుంగపేట

సంతోషం



నీరు-చెట్టు పనులు చేసింది టీడీపీ నాయకులనే కారణంతోనే గత ప్రభుత్వం బకాయిలు నిలిపేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. బకాయిలు చెల్లించేలా నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

- చింతాడ కృష్ణవాసుదేవరావు, టీడీపీ సీనియర్ నాయకుడు, గోరింట




స్వచ్ఛత మనందరి బాధ్యత

స్వచ్ఛత కోసం అందరూ ఒక్కటయ్యారు. అటు అధికారులు.. ఇటు ప్రజలు.. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు అంతా.. చేయిచేయి కలిపారు. స్వచ్ఛత మనందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. 'స్వచ్ఛతా హి సేవ' మూడోరోజు కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. శ్రీకాకుళంలోని ఎల్‌బీఎస్ పార్కులో హెల్త్‌ఆఫీసర్ సుధీర్‌కుమార్ నగరపాలక సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులందరూ భాగస్వామ్యమయ్యారు. దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మిల్లు జంక్షన్ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి 'స్వచ్ఛత మనందరి బాధ్యత' అంటూ ప్రతిజ్ఞ చేయించారు.

- శ్రీకాకుళం అర్బన్

నిజాన్ని అంగీకరించండి లేదా పోరాడండి

కొరియోగ్రాఫర్ షేక్ జానీభాషా (జానీ మాస్టర్) లైంగిక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నటుడు మంచుమనోజ్ స్పందించి.. ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'తప్పు చేస్తే అంగీకరించండి లేదా పోరాటం చేయండి. అంతేకాని పారిపోవద్దు' అని ఆయన హితవు పలికారు. "జానీ మాస్టర్.. కెరీర్ పరంగా ఈ స్థాయికి వచ్చేందుకు మీరు ఎంతలా శ్రమించారో అందరికీ తెలుసు. ఈరోజు మీపై ఇలాంటి ఆరోపణలు రావడం చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. తప్పు ఎవరిది అనేది చట్టం నిర్ణయిస్తుంది. ఒక మహిళ తన స్వరాన్ని వినిపించినప్పుడు


పారిపోవడం అనేది సమాజానికి, రానున్న తరాలకు ఒక ప్రమాదకరమైన సందేశాన్ని ఇస్తుంది. జానీ మాస్టర్.. నిజాన్ని ఎదుర్కోండి. మీరు ఏ తప్పూ చేయకపోతే పోరాటం చేయండి. మీరు దోషి అయితే.. దానిని అంగీకరించండి ఈ కేసు విషయంలో వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న హైదరాబాద్ సిటీ పోలీస్‌లకు అభినందనలు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఇది తెలియజేస్తుంది. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఇచ్చిన మాట ప్రకారం ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌ని వెంటనే సిద్ధం చేయాలని కోరుతున్నా. దానికంటూ ప్రత్యేకంగా సోషల్‌మీడియా ఖాతాలు ఏర్పాటు చేయండి. మన పరిశ్రమలోని మహిళలకు గళంగా నిలవండి. ఇబ్బందుల్లో ఉన్న మహిళల బాధను వింటామనే విషయాన్ని ప్రతి మహిళకు తెలియజేయండి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అండగా నిలబడిన మన పరిశ్రమ పెద్దలు, కో వర్కర్స్‌కు నా మద్దతు తెలియజేస్తున్నా. న్యాయం, గౌరవం అనేది మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లోనూ చూపించే విధమైన సమాజాన్ని నిర్మిద్దాం. కూతురు, సోదరి, తల్లి.. ఇలా ప్రతి మహిళ కోసం ఈ పోరాటం. వారికి అన్యాయం జరగకుండా చూద్దాం" అని మనోజ్ పేర్కొన్నారు. అలాగే, మరో నటుడు నాగబాబు చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆయన చేసిన ట్వీట్ జానీ భాషాని ఉద్దేశించినదే అని నెటిజనులు అనుకుంటున్నారు. ఇంతకీ ఆ ట్వీట్‌లో ఏముందంటే.. "తప్పు చేసిన వ్యక్తి చట్టపరంగా దోషిగా తేలనంతవరకూ.. ఆ వ్యక్తి తప్పు చేసినట్లు కాదు" అని సర్ విలియమ్ గ్యారో అనే రచయిత కొటేషన్‌ను నాగబాబు పోస్ట్ చేశారు.

కొత్త తేదీన కంగువ




సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. నవంబర్ 14న 'కంగువ'ను విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ యూనిట్ గురువారం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దిశాపటానీ, బాబీడియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

గుండెను తాకే నాన్న పాట



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. చిత్రబృందం గురువారం 'నాన్న' సాంగ్‌ను విడుదల చేసింది. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ సాగే ఈ గీతానికి లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా జై కృష్ణ స్వరపరిచారు. నజీరుద్దీన్ ఆలపించారు. ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సాయిచంద్, ఆమని కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి



అనంత శూన్యం నుంచి ప్రారంభమై అన్నింటినీ తనలో ఇముడ్చుకున్న మహామనీషి అక్కినేని. తెలుగు అక్షరమాలలో మొదటి అక్షరంతో మొదలైన ఆయన పేరు మిగిలిన అక్షరాలకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు, ఆయన జీవితాన్ని ఒక అందమైన కావ్యంగా తీర్చిదిద్దింది. మహానటుడిగా నిలబెట్టింది. దైవం, అదృష్టాల కన్నా కృషినే నమ్మారు అక్కినేని. ఆయన శతజయంతి (సెప్టెంబర్ 20) సందర్భంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రత్యేక స్టాంప్ విడుదల చేస్తోంది.



జననం - 20-09-1924
మరణం - 22-01-2014

ఓ బాటసారి నిను మరువమోయి

భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శిఖరంలాంటి నటుడు అక్కినేని నాగేశ్వరరావు. 90 వసంతాల జీవితంలో 70 వసంతాలను అభినయ కళకు అర్పించిన అరుదైన నటుడు. రంగస్థలంపై ఆడవేషాలతో నటనను ఆరంభించి కాలక్రమంలో అభినయ కళాశాలగా, నట నిఘంటువుగా ఎదిగారాయన.

ప్రారంభంలో జానపద, పౌరాణిక చిత్రాల కథనాయకునిగా తన నటజీవితాన్ని ఆరంభించినప్పటికీ కాలక్రమంలో అనేకానేక ఆధ్యాత్మిక, సాంఘిక పాత్రల ద్వారా సమకాలీన జీవన సొబగులను అభినయించి సినీ మాధ్యమాన్ని జనజీవనంతో మమైకం చేసిన ప్రజానటుడు ఆయన.

వాల్మీకి, క్షేత్రయ్య, తుకారామ్, తెనాలి రామకృష్ణ, విప్రనారాయణ, జయదేవుడు, కబీరు, కాళిదాసు వంటి విభిన్న పాత్రలు పోషించి తనకు తానే సాటి అనిపించుకున్నారు. నటనకే పరిమితం అవకుండా నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. నాటకాల రోజుల నుంచి తనకు ఎంతో అండగా నిలిచిన దుక్కిపాటి మధుసూదనరావుతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై ఆణిముత్యాల లాంటి చిత్రాలు నిర్మించారు. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో కలసి చక్రవర్తి చిత్ర పతాకంపై 'సుడిగుండాలు', 'మరో ప్రపంచం' వంటి ప్రయోగాత్మక సినిమాలు తీశారు. ఆ తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఎన్నో చిత్రాలు అందించారు.

స్వరాష్ట్రంలో చిత్ర పరిశ్రమ

తెలుగు చిత్ర పరిశ్రమ మదరాసు నగరం నుంచి హైదరాబాద్‌కు తరలి రావడానికి తొలి రోజుల్లో ఎంతో కృషి చేసిన వ్యక్తి అక్కినేని. 'నాతో సినిమా తీయాలనుకునే




నిర్మాతలు హైదరాబాద్‌కు రండి' అని కండీషన్ పెట్టి, దాని మీదే చివరి వరకూ నిలబడ్డారు అక్కినేని. ఆ రోజుల్లో భాగ్యనగరంలో చిత్ర నిర్మాణానికి అవసరమైన వసతులు అరకొరకుగానే ఉన్నా, వాటితోనే సరిపుచ్చుకుని అద్భుత చిత్రాలు తీయడానికి కారకులయ్యారు అక్కినేని.

మూడు పద్మాలూ ఆయనకే!

ఒక నటునిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, ఓ మహోన్నత వ్యక్తిగా అక్కినేని నాగేశ్వరరావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమ అధికార పరిధిలోని సమస్త సినీ ఘన పురస్కారాలను ఆయనకు కట్టబెట్టి పట్టాభిషేకాలు చేశాయి. మూడు పద్మాలు.. పద్మశ్రీ పద్మభూషణ్, పద్మవిభూషణ్ పొందిన ఏకైక నటుడు అక్కినేని. అలాగే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో తెలుగు వెలుగుల్ని హస్తినాపురం వరకూ ప్రసరింపచేసిన తొలి దక్షిణాది కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు.

నటనకే అంకితమైన కుటుంబం

ఏయన్నార్‌తో పాటు ఆయన కుటుంబం కూడా చిత్రపరిశ్రమకే అంకితమైంది. నాగేశ్వరరావు పెద్ద కుమారుడు వెంకట్ నిర్మాతగా కొనసాగారు. రెండో కుమారుడు నాగార్జున నటుడిగా, ఆయన కుమారుడు నాగచైతన్య, అఖిల్ హీరోలుగా ఉన్నారు. అక్కినేని పెద్ద అల్లుడు సురేంద్ర నిర్మాత కాగా, ఆయన కుమారుడు సుమంత్ నటుడిగా, కుమార్తె సుప్రియ కూడా ఆర్టిస్టులుగా కొనసాగుతున్నారు. అన్నపూర్ణ స్టూడియో బాధ్యతల్ని సుప్రియ నిర్వర్తిస్తున్నారు. ఇక అక్కినేని చిన్న కుమార్తె సుశీల కూడా నిర్మాతగా ఉన్నారు. ఆమె కుమారుడు సుశాంత్ నటుడిగా కొనసాగుతున్నారు.



చివరి చిత్రం 'మనం'

ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల కథానాయకులు పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రణధీర్ కపూర్ కలసి హిందీలో 'కల్ ఆజ్ ఔర్ కల్' (నిన్న నేడు రేపు) అనే చిత్రంలో కలిసి నటించారు. అది 1971లో విడుదలైంది. దాని తర్వాత మూడు తరాల కథానాయకులు కలిసి నటించిన చిత్రం 'మనం'. నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య అందులో ప్రధాన పాత్రధారులు. అఖిల్ ఈ సినిమా పతాక సన్నివేశంలో కనిపిస్తారు. మూడు తరాలకు సంబంధించి ఆసక్తికరమైన కథను తయారు చేసి, విక్రమ్ కుమార్ దర్శకత్వం వహించారు.

తొలి సినిమా 'శ్రీసీతారామ జననం'

మొదటి చిత్రం 'శ్రీసీతారామ జననం'లో శ్రీరాముడి పాత్రను అక్కినేని పోషించారు. 1944లో విడుదలైన ఈ చిత్రానికి ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకుడు.



సాధారణంగా ప్రేక్షకులెప్పుడూ హీరో పాత్ర మరణించడాన్ని జీర్ణించుకోలేరు. కానీ, అక్కినేని నటించిన దేవదాసు, ప్రేమాభిషేకం సినిమాల్లో హీరో మరణించినా ప్రేక్షకులు వాటికి బ్రహ్మరథం పట్టారు. ప్రణయ భావాల్ని, విషాదాల్నీ పలికించడం ఎవరికైనా సులువే. కానీ, వైరాగ్యాన్నీ, వేదాంతాన్నీ కలగలిపి పలికించడం అంత సులువేం కాదు. కళ్లు ఏడుస్తుంటే, పెదాలు నవ్వడం ఏకకాలంలో జరగాలి మరి! అలాంటి కష్టసాధ్యమైన హావభావాల్ని అలవోకగా, అద్భుతంగా పండించిన అసామాన్యుడు అక్కినేని. అందుకే భగ్న ప్రేమికుడి పాత్రలకు ఆలంబనగా, తాగుబోతు పాత్రలకు చిరునామాగా నిలిచారు అక్కినేని

'స్వీయ లోపంబు లెరుగుట పెద్ద విద్య'.. ..అక్కినేని తరుచుగా చెప్పే మాట ఇది. చెప్పడమే కాదు ఆచరణలో కూడా చూపించారు. తన లోపాలను ఇతరులకంటే ముందు గ్రహించి, దానికి అనుగుణంగానే పాత్రలు ఎంపిక చేసుకోవడం అక్కినేని విజయరహస్యం. మనిషి అందగాడు కాదు, అరడుగుల ఆజానుబాహు కాదు. మరో వైపు ఎన్టీఆర్ వంటి సర్వాంగ సుందరుడు, ఆజానుబాహుడు తన పోటీగా, సమవుజ్జీగా ఎదుగుతుండగా తన అనర్హతల లేమిని కప్పిపుచ్చుకుంటూ, తన మనోబలాన్ని పెంచుకుంటూ అక్కినేని సాగించిన ఆరోగ్యకరమైన వృత్తిపోటీ ఈ నాటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పాలి

అక్కినేని పోషించిన దసరా బుల్లోడు పాత్ర ఒక సంచలనం. అతను టిప్‌టాప్‌గా రంగురంగుల బట్టలు వేస్తాడు. హీరోయిన్‌తో షికార్లు చేస్తాడు. 'పచ్చగడ్డి కోసేటి పడుచు పిల్లోయ్.. నీ పైటకొంగు జారిందే గడుసు పిల్లా' అని ఆమెని టీజ్ చేస్తాడు. డాన్సులు వేస్తాడు. తమ కుటుంబానికి అపకారం తలపెట్టిన దుష్టుల తాట వలిచేస్తాడు. ఆ పాత్రను సృష్టించింది వి.బి. రాజేంద్రప్రసాద్. ఆ సినిమాకి ఆయనే నిర్మాత, అంతేకాదు, ఆ సినిమాతోటే ఆయన దర్శకుడి అవతారమెత్తారు. అలా 'దసరా బుల్లోడు'గా అక్కినేని వీరంగం ఆడేశారు. ఆయన స్టెప్పుల్లో జనం స్టెప్పులేశారు. ఆ సినిమా నుంచే 'డాన్సింగ్ ఐకాన్'గా రూపు దాల్చారు.

అప్‌డేట్స్

చిత్రీకరణ షురూ



'దసరా' కలయిక మరోసారి కుదిరింది. నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించారు. ఈ విషయాన్ని శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

సంపత్ నందితో శర్వా



శర్వానంద్ కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. 'శర్వా 38' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ గురువారం మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. శర్వా మునుపెన్నడూ చేయని పాత్రలో కనిపించనున్నారని యూనిట్ తెలిపింది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్

మరోసారి మెగాఫోన్



ధనుష్ తాను కీలకపాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రం ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు మరోసారి ఆయన ఓ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు మెగాఫోన్ పట్టారు. డాన్‌పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఇడ్లీ కడై' అనే ఆసక్తికర టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇడ్లీ బండి దగ్గర పిల్లలు నిల్చున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ధనుష్‌కు దర్శకుడిగా ఇది నాలుగో చిత్రం. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కిరణ్ కౌశిక్.

వారంలోగా తేల్చండి



కంగనా రనౌత్, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రలో నటించి.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెన్సార్ చిక్కులతో చిత్రం విడుదల వాయిదా పడుతోంది. అయితే ఈ సినిమా సెన్సార్ సర్టిఫికేట్ విషయంలో వారంలోగా ఓ నిర్ణయానికి రావాలని బాంబే హైకోర్టు సెన్సార్ బోర్డును ఆదేశించింది. ఈ సినిమా సెప్టెంబర్ 6న విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ చిత్రంలో సిక్కు వర్గాన్ని కించపరిచే సన్నివేశాలు ఉన్నాయి కాబట్టి సినిమా విడుదలను నిలిపివేయాలని కొన్ని సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు వారి వాదనలను పరిగణలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది. మరోవైపు కంగన, చిత్ర నిర్మాణసంస్థ జీ ఎంటర్టైన్‌మెంట్స్ ఈ విషయమై బాంబే కోర్టును ఆశ్రయించగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వమని.. సెన్సార్ బోర్డును ఆదేశించలేమని బాంబే హైకోర్టు తెలిపింది. ఈ క్రమంలోనే తాజా విచారణ అనంతరం వారంలోపు ఓ నిర్ణయానికి రావాలని బాంబే కోర్టు సెన్సార్ బోర్డుకు సూచించింది.

బిల్లులు కాక.. పనులు సాగక

● ఐదేళ్లు గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం ● ఇదీ టెక్కలి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల పరిస్థితి


టెక్కలిలో నిలిచిపోయిన గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణం

టెక్కలి: టెక్కలిలో గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల పనులకు సంబంధించి బిల్లులు కాకపోవడంతో నిర్మాణం ముందుకుసాగడం లేదు. గత టీడీపీ హయాంలో ఈ పనులకు శంకుస్థాపన చేసినా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గాలికొదిలేసింది. వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తి భవనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రస్తుతం అరకొర గదుల్లో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం ఈ భవన ప్రాంగణాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి.భవన నిర్మాణానికి సంబంధించి రూ.2కోట్ల75లక్షల ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గ్రాంట్ విడుదల కావడంలేదు. దీనికితోడు కాంట్రాక్టర్‌కు ఐటీడీఏ యంత్రాంగం రూ.2 కోట్లు వరకు చెల్లించాల్సిఉంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవచూపి నిధులు విడుదలకు చర్యలు తీసుకొని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల నిర్మాణం పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

పనులు ప్రారంభించినా..

టెక్కలిలో రూ.8కోట్ల75లక్షల అంచనా వ్యయంతో 2019లో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ భవనానికి సంబంధించి రూ.6కోట్ల ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు, రూ.2కోట్ల75లక్షలు ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు మంజూరుచేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.2కోట్ల75లక్షల నిధులు విడుదల చేయకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ కేవలం 16గదులు నిర్మాణం చేసి శ్లాబ్, బ్రిక్ వంటి పనులు పూర్తిచేసి మిగిలిన డార్మెటరీ, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, కిచెన్ షెడ్ వంటి పనులు నిలిపివేశారు.జిల్లా పర్యటనకు వచ్చిన గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రాంతీలాల్‌దండే, ఇంజినీరింగ్ చీఫ్ శ్రీనివాస్‌తోపాటు ఐటీడీఏ పీవోలుగా వ్యవహరించిన జల్లేపల్లి వెంకట్రావు, నవ్య, కల్పన, శివశంకర్ ఈ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా ఈ భవనాలు చూడడం, వీటి పరిస్థితిపై ఆరాతీయడం పరిపాటిగా మారింది తప్ప పనుల్లో పురోగతి లేకుండాపోయిందని విమర్శలొస్తున్నాయి. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు మాత్రం ఐటీడీఏ నుంచి అడ్వాన్స్ గ్రాంట్లు చెల్లిస్తే పనులు పూర్తిచేస్తామని చెబుతుండేవారు.

నిధులు మంజూరైతే పనులు

ఇప్పటికే ఈ భవనాలకు సంబంధించి రూ.2కోట్లు వరకు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉందని ఐటీడీఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు.ఈ భవన నిర్మాణాలకు మంజూరైన రూ.2కోట్ల75లక్షల ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రాంట్ విడుదల కాకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని చెప్పారు. ఈవిషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో నిధులు మంజూరైతే ఈ పనులు చేపడతామని తెలిపారు.

వరిలో పొటాష్ వినియోగం తప్పనిసరి: ఏడీఏ


నందిగాం: మాట్లాడుతున్న కృష్ణారావు

నందిగాం: వరిలో పొటాష్ వినియోగం తప్పనిసరి అని వ్యవసాయ, సాంకేతిక యాజమాన్య సంస్థ, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.కృష్ణారావు తెలిపారు. గురువారం దేవళభద్రలో ఆత్మ పథకం కింద రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బీవీ తిరుమలరావు,ఏవో పి.శ్రీకాంత్‌వర్మ, వంశధార ప్రాజెక్ట్ ఛైర్మన్ మళ్ల బాలకృష్ణ, వీఏఏ మానసవీణ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

కోటబొమ్మాళి:తిలారు రైతుసేవా కేంద్రంలో వ్యవసాయసాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వరిపైరులో సస్యరక్షణ చర్యలపై రైతులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకుడు కె.కృష్ణారావు వరిలో తెల్లదోమ నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బీవీ తిరుమలరావు, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, మాజీ సర్పంచ్ జి.రఘునాద్, ఏవో ఎస్.గోవిందరావు, వీఏఏ ఎం.మాధవి పాల్గొన్నారు.

రైతుబజారుకు ప్రతిపాదనలు

కొత్తూరు: కొత్తూరులో రైతు బజారుకు అవసరమైన స్థలాన్ని రెవెన్యూ శాఖ కేటాయించిన వెంటనే ప్రభుత్వానికి రైతు బజారు కోసం ప్రతిపాదన పంపిస్తామని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకురాలు జేఎస్ నాగలక్ష్మిజ్యోతి తెలిపారు. రైతు బజారు లేక అవస్థలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఆమె స్పందించారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారి జి. శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోగల కొత్తపేట, కోటబొమ్మాళి, బంజీరుపేట, సీతన్నపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేడు మన మంచి ప్రభుత్వం సభ

మెళియాపుట్టి: చాపరలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తికావడంతో శుక్రవారం మనమంచి ప్రభుత్వం సభ నిర్వహించనున్నట్లు టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు అనపాన రాజశేఖరెడ్డి తెలిపారు. కూటమి నాయకులు హాజరుకావాలని కోరారు.

22న గ్రూప్-2 మాక్‌టెస్ట్

టెక్కలి:టెక్కలి విశ్వజ్యోతి డిగ్రీ కళాశాలలో గ్రూప్-2 విద్యార్థులకు ఎర్రన్న విద్యాసంకల్పకార్యక్రమంలో భాగంగా ఈనెల 22న మాక్‌టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి పేపరు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండో పేపరు జరుగుతుందని పేర్కొన్నారు. మాక్‌టెస్ట్‌కు కనీసం అభ్యర్థులు అరగంట ముందైనా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

22న ఏపీటీఎఫ్ మహాసభలు

పలాస రూరల్: శ్రీకాకుళంలో ఈనెల 22న జరిగే ఏపీటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు,జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో కోరారు.సంఘం ఏర్పడి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీకాకుళంలో విద్యా వైజ్ఞానిక మహాసభలను నిర్వహిస్తున్నారని తెలిపారు.

శాఖా గ్రంథాలయంలో తనిఖీ

టెక్కలి: టెక్కలిలోని శాఖాగ్రంథాలయాన్ని గురువారం గ్రంథాలయసంస్థ కార్యదర్శి వి.కుమార్‌రాజు తనిఖీ చేశారు.ఈసందర్భంగా రికార్డులు, నంద్యాల గురు రాఘవేంద్ర ఇనిస్టిట్యూట్ అందించిన పుస్తకాలను పరిశీలించారు. పోటీ ఆయనతో పాటు గ్రంథాలయ అధికారి బి.రూపావతి, అమ్మన్నలు ఉన్నారు.

వీధి దీపాలు వెలగక అవస్థలు

వజ్రపుకొత్తూరు: రాజాం పంచాయతీ పరిధిలో రాజాం, సారధిపేట, ధర్మపురంలో కొద్దిరోజులుగా వీధి దీపాలు వెలగపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని టీడీపీ నాయకులు పోతనపల్లి సాంబమూర్తి, రెల్ల దానయ్య, చెల్లూరు రాజశేఖర్ పేర్కొన్నారు. పారిశుధ్యకార్యక్రమాలు చేపట్టకపోవడంతో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెలువడుతోందని తెలిపారు.

సీసీ రోడ్లకు నిధుల మంజూరు

హరిపురం: మందస మండలంలోని పిడిమందస నుంచి కాలమ్మ ఆలయానికి, బేతాళపురం రహదారి నుంచి బీచ్‌వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. పిడిమందసకు రూ.4.10లక్షలు, బేతాళపురంలో రూ.60లక్షలు ఎన్‌ఆర్‌ఈఎస్ నుంచి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిధులు విడుదలకావడంతో మందస మండల టీడీపీ నాయకులు భావన దుర్యోధన, రట్టి లింగరాజు, భైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, జయరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలి

మెళియాపుట్టి: నిరుద్యోగ యువతకు ట్రైకార్ రుణాలు మంజూరుచేయాలని గిరిజన సంఘం నాయకులు సవరకుమార్ కోరారు. సీతంపేటఐటీడీఏ పీవో యస్వంత్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మెళియాపుట్టిలో గిరిజనదర్బార్ ఏర్పాటుచేయాలని కోరారు.

కుమార్‌నాయక్‌కు ఎక్సలెన్స్ అవార్డు

పలాస రూరల్: పలాసకు చెందిన కళాకారుడు కుమార్‌నాయక్‌కు గురువారం హర్యానా ఎక్సలెన్స్-2024 సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ బండారు దత్తాత్రేయ అవార్డును అందజేశారు. వివిధ సంస్థల్లో, కళావేదికలు, సినిమా రంగాల్లో విశేషంగా రాణించినందుకు అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు కుమార్‌నాయక్ తెలిపారు.

120 మందికి వైద్యపరీక్షలు

నందిగాం: సుభద్రాపురంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో 120మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుజ్జ తాతయ్య, జెమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో అన్న సంతర్పణ

మెళియాపుట్టి: మెళియాపుట్టి రెడ్డి బజారు వీధిలో వినాయక నవరాత్రులు పురస్కరించుకుని అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖరెడ్డి, పరమేష్‌రెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ

పాతపట్నం:పాతపట్నంలోని లవ్లీచిల్డ్రన్‌హౌస్ అనాథాశ్రమానికి 2018 ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఐదు బస్తాల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, కోటేశ్వరరావు, లక్ష్మణరావు అప్రజ్ సంతోష్ సూర్యం పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం


లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం: విజయవాడ వరద బాధితులకు రూ.ఐదు లక్షల చెక్కును మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. గురువారం ఉండవల్లిలో నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కలిశారు.ఈమేరకు ఎమ్మెల్యేతోపాటు బామిడి రాజు, శ్రీరామ్ రమణ, పడ్డ లోకేశ్, గుంపు భాస్కరరావు, రెంటికోట మాధవరావు ఒక్కక్కరు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.ఐదు లక్షల చెక్కును మంత్రికి అందజేశారు.

నియోజకవర్గంపై దృష్టి సారించాలి

నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. గురువారం ఉండవల్లిలో గోవిందరావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. డీఎస్సీ ఉచితశిక్షణ ఇవ్వడంతోపాటు శిక్షణపొందిన అభ్యర్థులకు ఉచితంగా పంపిణీచేసినమెటీరియల్‌ను ఆయనకు చూపించారు.వ్యక్తిగత ఖర్చులతో డీఎస్సీకోచింగ్‌సెంటర్ నిర్వహించడంపై మంత్రి అభినందించారు.ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విజయవాడలో కలిశారు.

మండల మహిళా సమాఖ్య కమిటీ ఎన్నిక

వజ్రపుకొత్తూరు:స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాసరావు అధ్యక్షతన మండల మహిళా సమాఖ్య కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కోడ సరస్వతి, ఉపాధ్యక్షురాలిగా కీలు నిరోషా, ప్రధానకార్యదర్శిగా పుచ్చ కళ్యాణి, ఉపకార్యదర్శిగా చెహరా చొంపమ్మ, కోశాధికారిగా నక్క చంద్రకళను ఎన్నుకున్నారు. వీరితో శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు.

ఈవ్‌టీజింగ్‌పై యువతకు కౌన్సెలింగ్

హరిపురం:హరిపురం-బాలిగాం కూడలిలో యువకులకు ఈవ్‌టీజింగ్‌పై ఎస్‌ఐ ఖాదర్‌భాషా కౌన్సెలింగ్ నిర్వహించారు. హరిపురంలో కళాశాలల విడిచిపెట్టే సమయంలో యువకుల ఈవ్‌టీజింగ్ చేయడంతోపాటు, బైక్ రేసింగ్‌ల వల్ల మహిళలు, విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు.దీంతోమందస ఎస్‌ఐ ఖాదర్‌భాషా మూడురోజులుగా హరిపురం, బాలిగాం కూడలిలో ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు.

హిందీని పాఠ్యాంశంగా అమలుచేయాలి

పోలాకి: పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషను పాఠ్యాంశంగా అమలుచేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్రకౌన్సిలర్ జి.వీరస్వామి కోరారు. గురువారం గొల్లలవలస ఉన్నతపాఠశాలలో హిందీ దివస్ పక్షోత్సవాలు నిర్వహించారు. హెచ్‌ఎం రమణమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైదరాబాద్ హిందీప్రచారసభ నిర్వహించిన నాగరీబోద్, ప్రవేశ, ప్రథమ పరీక్షల యోగ్యతా పత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోసంరక్షణ శాలకు స్థల పరిశీలన

టెక్కలి:రోడ్లపై తిరుగుతున్న పశువులను సేకరించి గోసంరక్షణశాలలో ఉంచేందుకు అవసరమైన స్థలంకోసం వంశధార కాలనీలో పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ గురువారం పరిశీలించారు. స్థలాన్ని శుభ్రంచేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీబాయి, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు, ఏపీవో బగాది ప్రసాద్, ఈవో జగన్నాధరావు, టీడీపీ నాయకులు లవకుమార్ ఉన్నారు.

జోగినాయుడు మృతికి సంతాపం

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన హార్మోనిస్టు, భజన గురువు చోడవరపు జోగినాయుడు గురువారం మృతిచెందారు. ఈ మేరకు విశ్వ హిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి గేదెల మన్మథరావు, జిల్లాలోని కళాకారుల సంఘ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

ఎయిడెడ్ అధ్యాపకుల విలీనం రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

నరసన్నపేట: గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో-42 ద్వారా ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలీనం చేయడాన్ని రద్దుచేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కోరారు.ఈ మేరకు గురువారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అధ్యాపకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఎయిడెడ్ అధ్యాపకులను వారి మాతృసంస్థలకు పంపించాలని డిమాండ్ చేశారు. కాగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో జి. రవికుమార్, అన్నాజీరావు పాల్గొన్నారు.

తిర్లంగిలో ఆక్రమణల తొలగింపు

● రెవెన్యూ అధికారులతో వాగ్వాదం.. ఉద్రిక్తత


ఆక్రమణ తొలగింపును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

టెక్కలి: మండలంలోని తిర్లంగిలో సర్వేనెంబరు 89/20లో గల ఓ డ్రైనేజ్‌పై సాహుకారి విమల అనే మహిళ చేపట్టిన నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు తొలగించిన సమయంలో ఉద్రిక్తత నెలకొంది. తమకు నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని ఆమె అధికారులను ప్రశ్నించింది. ముందుగా సమాచారం ఇచ్చామని తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి చెప్పడంతో విమలతోపాటు కొందరుగ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. ఆక్రమణపై ఫిర్యాదులు మేరకే తొలగింపునకు శ్రీకారం చుట్టారని తహసీల్దార్ చెప్పగా విమల పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొంది. అయితే రెవెన్యూ అధికారులు బెదిరింపులకు తలొగ్గే ప్రసక్తే లేదని, పద్ధతి ప్రకారం నడుచుకుంటారని తెలిపారు.

ఆశావర్కర్‌ను తొలగించాలి

●కిష్టుపురం గ్రామస్థులు సూపరింటెండెంట్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న కిష్టుపురం గ్రామస్థులు

పలాస రూరల్: మండలంలోని కిష్టుపురం ఆశావర్కరు బూర్లె కృష్ణవేణిని తొలగించాలని గ్రామస్థులు కోరారు.ఈ మేరకు గురువారం గ్రామస్థులు పి.భారతి, ఎం.లలితమ్మ, ఢిల్లేశ్వరరావు, ఎన్.బాబూరావు, ఎన్.లత, డి.ధనలక్ష్మీ, మహాలక్ష్మీ, రోజా, ఎం.కుచేలుడు, ఎం.మాధవరావు, బి.పార్వతి పలాస మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కృష్ణవేణిపై దాడికి పాల్పడినట్లు అసత్యప్రచారంతో టీడీపీ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు, ధర్నాలు చేయడం తగదని హితవుపలికారు. కృష్ణవేణి గత ప్రభుత్వం కార్యకర్తలా విధులు నిర్వహిస్తోందని ఆరోపించారు. ఆమె ప్రభుత్వానికి విరుద్ధంగా కార్యక్రమాలు చేపట్టడం సరికాదని, ఆమెను తొలగించి మరొకరిని నియమించాలని కోరారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

● వజ్రపుకొత్తూరు మండల టీడీపీ నాయకులు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ముందుకు సాగుతుంటే వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నరని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వజ్రపుకొత్తూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు సూరాడ మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షులు పోతనపల్లి సాంబమూర్తి, మండల ఉపాధ్యక్షులు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పినా వైసీపీ నాయకుల తీరు మారలేదన్నారు.పల్లపు, ఉద్దాన రైతాంగాన్ని ఆదుకున్న ఘనత ఎమ్మెల్యే గౌతు శిరీషకే దక్కుతుందని పేర్కొన్నారు. అప్పలరాజు లోపాయకారీ కమీషన్లకు ఆశపడి జీడిపంట ధర పెరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిక్కలను రూ.14 వేలకు వరకు రైతులు అమ్ముకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికేనా వైసీపీ నాయకులు హుందాగా మెలగాలని హితవుపలికారు. కార్యక్రమంలో నెయ్యిల సూర్యనారాయణ, రెల్ల దానయ్యవంక రామారావు, చెల్లూరు రాజశేఖర్, కె.శాంతారావు పాల్గొన్నారు.

కిల్లోయిలో పౌష్టికాహార వారోత్సవాలు


కిల్లోయిలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

హరిపురం: మందస మండలంలోని మందస సెక్టార్ పరిధిలోని కిల్లోయిలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో వసుంధరాదేవి పౌష్టికాహారంతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంగమ్మ, రామలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

● **పలాస రూరల్:** బొడ్డపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పౌష్టికాహార వారోత్సవాలు, అన్నప్రాస మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిక్కర డిల్లీరావు, స్కూల్ ఛైర్మన్ పి.దివ్య, అంగన్‌వాడీ సూపర్ వైజరు ఉర్నాన దానమ్మ, మీనాకుమారి, మోహనరావు పాల్గొన్నారు.

లింగాలవలసలో విశ్వకర్మ విగ్రహం నిమజ్జనం


లింగాలవలసలో విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న విశ్వకర్మ పంచవృత్తుల సహకార సంఘం సభ్యులు

జలుమూరు:లింగాలవలసలో కొలువుదీరిన విశ్వకర్మ భగవాన్‌ను గురువారం రాత్రి ఘనంగా నిమజ్జనం చేశారు. మూడురోజుల పాటు విశ్వకర్మ పంచవృత్తుల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక వాహనంలో ఆసీనులను చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఊరేగించారు. వంశధార కాలువలో నిమజ్జనం చేశారు.

సారవకోటలో శాంతి హోమం

జలుమూరు (సారవకోట): సారవకోట మెయిన్ వీధిలో కొలువుదీరిన విశ్వకర్మ భగవాన్ సన్నిధిలో గురువారం కుంకుమ పూజలు, శాంతి హోమం నిర్వహించారు. పురోహితులు జుత్తాడ శేషాచలం శాస్త్రీ ఆధ్వర్యంలో లక్కోజి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, సురవరపు తిరుపతిరావు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు


హిరమండలం కార్యాలయంలో సిబ్బందితోపాటు విధులు నిర్వహిస్తున్న దృశ్యం

హిరమండలం: హిరమండలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియాన్ని తొలగించి సిబ్బందితో సమానంగా టేబుల్ ఏర్పాటు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే కక్షిదారులతో స్నేహపూర్వకంగా ఉండి వారి పనులు చేస్తున్నారు. ఆంగ్లేయుల కాలం నుంచి వస్తున్న రాచరిక పోకడలను స్వస్తి పలకాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగించారు. ఈమేరకు జిల్లాలోని 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియాలను తొలగించారు.

స్కూల్‌గేమ్స్ ఎంపికలు

పలాస రూరల్: మండలంలోని బొడ్డపాడు జడ్పీ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న స్కూల్‌గేమ్స్ అండర్-17 విభాగం కబడ్డీ బాలుర విభాగంలో భారత్, రాపాక ప్రణీత్, బాలికల విభాగంలో గడ్డి పూజ, మామిడి లోహిత నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ రాంజీ గురువారం తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో రాపాక అక్షర, బాలుర విభాగంలో దాసరి సాయికుమార్, మోహనకృష్ణ ఎంపికైనట్లు చెప్పారు.

● **హిరమండలం:** క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, ఎంపీపీ తూలుగు మేనక తెలిపారు. కల్లట కార్మెల్ పాఠశాల ఆవరణలో గ్రిగ్స్ క్రీడాపోటీలు ప్రారంభించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని ఎంఈవో కె.రాంబాబు చెప్పారు.

●**పోలాకి:** విద్యార్థులు ఆటపాటలతోపాటు విద్యలో రాణించాలని పోలాకి ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ కె.గోవిందరావు కోరారు. గురువారం కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు.

సవరణ

15-08-2024 ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించబడిన బహిరంగ ప్రకటనలో నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాకుళం-II భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, నందిగాం మండలం, పెంటూరు గ్రామ కాపురస్థులైన శ్రీమతి ప్రగడ వసుంధర W/o ప్రగడ బాలకృష్ణ నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు హామీగా శ్రీ ప్రగడ బాలకృష్ణ S/o ప్రగడ వైకుంఠరావు స్వాధీన,హక్కు దీనికి బదులుగా నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాకుళం-II భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, నందిగాం మండలం, పెంటూరు గ్రామ కాపురస్థులైన శ్రీమతి ప్రగడ వసుంధర W/o ప్రగడ బాలకృష్ణ నా క్లయింట్ సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు అతని స్వాధీన, హక్కు అని పరిగణనలోకి తీసుకొనగలరు.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

టెక్కలిలో కాంగ్రెస్ నాయకుల నిరసన


ఇందిరాగాంధీ కూడలిలో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టెక్కలి: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై బెదిరింపులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.ఈ మేరకు గురువారం టెక్కలిలో ఇందిరాగాంధీ కూడలిలో కేంద్రమాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, డీసీసీ మాజీ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, కాంగ్రెస్ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పీ కార్యాలయనికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సనపల అన్నాజీ, చక్రవర్తిరెడ్డి, వెంకట్రావు, మంత్రి నర్సింహమూర్తి, కోత మధుసూధనరావు, పొట్నూరు ఆనందరావు, టీబీజీ గుప్త, సూర్యకుమారి, కిరణ్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ దుర్మరణం

పలాస: హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్‌కు గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన సందీప్ కుమార్(22) వీఆర్ఎల్ ట్రాన్స్‌పోర్టులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. జీడిపప్పును రవాణా చేయడానికి వచ్చిన ఆయన బుధవారం రాత్రి మొగిలిపాడు వద్ద లారీని ఆపి బహిర్భూమికి వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అదే కంపెనీలో పనిచేస్తున్న మరో డ్రైవర్ మంజిదర్సింగ్ గుర్తించి సందీప్‌కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆటో బోల్తా.. ఆగురురికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

పొందూరు: మండల కేంద్రం పొందూరు మేదరు వీధి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నక్కపేట గ్రామానికి చెందిన ఆరుగురు అదే గ్రామానికే చెందిన పొగిరి సన్యాసిరావు ఆటోలో చెట్టుపొదిలాం గ్రామంలో పరామర్శకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పొందూరు పట్టణం మేదరవీధి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న వారనాసి సంగం చేయి విరుగగా.. మరో ఐదుగురు మహిళలు గాయపడ్డారు. గాయపడిన వీరిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కాగా ద్విచక్రవాహనదారుడికి గాయాలవ్వడంతో పొందూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎన్ కాలనీలో చోరీలు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యుడు, ఇంట్లో చెల్లాచెదురుగా పడిఉన్న వస్తువులు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని పీఎన్ కాలనీలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లల్లో దొంగలు చోరీకి తెగబడ్డారు. 10వ లైన్‌లో కె.రామ్మూర్తి, రమాదేవి దంపతులు నివాసముంటున్నారు. రామ్మూర్తి కొల్లివలసలో, రమాదేవి కోటబొమ్మాళిలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. గత శనివారం కుటుంబంతో కలసి బెంగళూరు వెళ్లారు. పనిమనిషి రమణమ్మకు గేటు తాళం ఇచ్చి బయట పెరడు రోజు శుభ్రం చేయమని చెప్పారు. దీంతో గురువారం ఉదయం 7గంటలకు రమణమ్మ వెళ్లగా ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సామాన్లు చిందరవందరగా ఉండటం గమనించి స్థానికులకు చెప్పింది. వారు వెళ్లి చూడగా దొంగతనం జరిగిందని గుర్తించి డయల్ 100కు సమాచారం అందించారు. టూటౌన్ సీఐ ఉమామహేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి యజమానులు బెంగళూరు నుంచి ఎంత మేర దొంగతనం జరిగిందో ఫిర్యాదు చేయాల్సి ఉంది. ● ఇదే కాలనీ 3వ లైన్‌లో రిటైర్డ్ టీచర్ బొడ్డేపల్లి రామారావు నివాసం ఉంటున్నారు. ఈయన కుమారుడు పోలీసు శాఖలో సీఐగా పని చేస్తున్నారు. మంగళవారం రామారావు, అతని భార్య ఇంటికి తాళం వేసుకుని ఊరెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దాటాక దొంగలు వారి ఇంటి తాళం బద్దలుకొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని రెండున్నర కేజీల వెండి, అరతులం బంగారం దొంగలించారు. గురువారం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని పక్కింటి వాళ్లు చూసి రామారావుకి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో రామారావు ఇంటికి చేరుకుని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

నరసన్నపేట: మండలంలోని దూకలపాడులో టీడీపీ కార్యకర్త ముద్దాడ శిమ్మయ్యపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసినట్లు గురువారం ఫిర్యాదు అందిందని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈనెల 16వ తేదీ రాత్రి వినాయక నిమజ్జనం చేస్తున్న సమయంలో వైసీపీ కార్యకర్తలు పొన్నాన గోవిందరావు, శంకరరావు, బొంగు చంద్రరావు ఉద్దేశపూర్వకంగా తనపై దాడికి పాల్పడ్డారని శిమ్మయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. 17వ తేదీ రాత్రి గ్రామ పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో కూడా వైసీపీ కార్యకర్తలు తనను కొట్టడంతోపాటు, బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పాడు. శిమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాగు చోరీపై ఫిర్యాదు


బ్యాగు తీసుకెళ్లిన వ్యక్తి చిత్రం

శ్రీకాకుళం క్రైం: తన బ్యాగు చోరీకి గురైందని నగరానికి చెందిన కస్పా సాయిరాం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. సాయిరాం తన తోటి ఉద్యోగి కూర్మాపు ఢిల్లీశ్వరరావుతో కలసి విశాఖ-బి కాలనీలోని సాయిబాబా గుడికి వెళ్లాడు. తన బ్యాగును ఆలయం బయట ఢిల్లీశ్వరరావు బైక్‌పై ఉంచి బాబాను దర్శించుకోవడానికి ఇద్దరూ లోపలకు వెళ్లారు. దర్శనం అనంతరం ఆలయం నుంచి బయటకు వచ్చిన సాయిరాం తన బ్యాగు కనిపించకపోవడంతో అంతా వెతికారు. ఆలయ కమిటీ సభ్యుల ద్వారా సీసీ ఫుటేజీ పరిశీలించారు. అందులో ఓ వ్యక్తి హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై బ్యాగు తీసుకెళ్లడం రికార్డు అయ్యింది. దీంతో సాయిరాం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగులో రూ.6వేలు నగదు, ముఖ్యమైన పత్రాలు ఉన్నాయని సాయిరాం తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళంక్రైం: నగరంలోని న్యూకాలనీలో ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటాక పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ జి.ఉమామహే శ్వరావు తెలిపారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.78,030 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్ల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులపై అసభ్యపదజాలం వినియోగిస్తున్నాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ డీఈవో విజయకుమారి మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన 8,9 తరగతి విద్యార్థుల తలిదండ్రులు మాత్రమే ఆ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారని, ఈ మేరకు శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

పుస్తెల తాడు చోరీ

ఆమదాలవలస: మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ ఆనందపురం కాలనీకి చెందిన చింతాడ వెంకటరమణ (75) తన భార్యతో కలసి పాలకొండ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆమదాలవలస ఫ్లైఓవర్ దిగువన ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద బస్సు దిగారు. అక్కడ నుంచి పట్టణంలో ఉన్న తన కుమారుడి ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి చూస్తుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి వారిని ఆటోలో ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక వెంకటరమణ భార్య మెడలో ఉన్న సుమారు రెండు తులాల పావు పుస్తెల తాడును తస్కరించి వారిని మార్గమధ్యలో విడిచిపెట్టి వెళ్లిపోయారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు.

పేరుకే బస్టాండ్

- కనీస వసతులు కరువు
- బీటలు వారిన స్తంభాలు
- గారలో ప్రయాణికులకు తప్పని అవస్థలు


కనీస వసతులు లేని గార బస్టాండ్

గార: మండల కేంద్రమైన గారలోని మూడు రోడ్లు కూడలి వద్ద రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. శ్రీకాకుళం నుంచి బందరువానిపేట, కళింగపట్నం, కొమరవానిపేట తదితర గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్‌లు ఇక్కడ నిలుపుదల చేస్తారు. బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు ఈ బస్టాండ్‌లో కనీసం కూర్చోడానికి బెంచీలు లేక సిమెంట్ దిమ్మలపై కూర్చోవాల్సి వస్తోంది. తాగేందుకు మంచి నీరు కూడా అందుబాటులో లేదు. మరుగుదొడ్లు సౌకర్యం లేక ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో రాత్రివేళ చీకటిగా ఉంటోంది. అలాగే రెండు దశాబ్దాలు కిందట నిర్మించిన ఈ బస్టాండ్‌కు ని ర్వహణ లేక స్తంభాలు బీటలువారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసర మైన కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్: బీజేపీ దాని మిత్రపక్షాలు దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడంపై రాహుల్ గాంధీ ప్రశ్నించడాన్ని జీర్ణించుకోలేక ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. అలాగే డీఎస్పీకి ఈ విషయంపై వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీఎల్ఎస్ ఈశ్వరి, కె.వెంకటరావు, అంబటి దాలినాయుడు, కె.రాంప్రసాద్, ఎ.రవికుమార్, అంబటి రాజారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం



ఆమదాలవలస: పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ శుక్రవారం ప్రారంభించనున్నారు. 2014-19 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.5కే పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయగా, 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. 2024 ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు మళ్లీ అన్నా క్యాంటీన్లు తెచ్చుకుంటున్నాయి. ఆ హామీ మేరకు ఆమదాలవలస పట్టణంలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను అధికారులు తీసుకున్నారు.

ప్రారంభమైన గ్రామ దేవత ఉత్సవాలు


తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: పెంట గ్రామంలో చెవిటి పోలమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు, నీలమ్మతల్లి సంబరాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పూజారి మక్క విజయలక్ష్మి తెలిపారు. గురువారం నీలమ్మతల్లి సంబరాలు, ఆదివారం దేశాలమ్మతల్లి సంబరాలతో పాటు మంగళవారం చెవిటి పోలమ్మతల్లి ఉత్సవ విగ్రహాలను గ్రామంతో పాటు పాతపెంట, లింగాపురం, నాగులవలస గ్రామాల్లో తిరువీధిని నిర్వహించి గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న అమ్మవారి వనంలో చెలిట్లిపోలమ్మకు దండకంతో పూజలు చేయనున్నట్టు విజయలక్ష్మి తెలిపారు.

ముగిసిన గ్రిగ్స్ పోటీలు

పొందూరు: మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీల ప్రత్యేకాధికారి, ఎంఈవో-2 పి.రాజారావు సమక్షంలో పోటీలు జరిగాయి. రెండో రోజుల ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలను వ్యాయామ ఉపాధ్యయులు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు శుక్రవారం నుంచి ఆమదాలవలస మండలం తొగరాంలో జరగనున్న నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో-2 రాజారావు తెలిపారు.

పొందూరులో యూనియన్ బ్యాంకు ప్రారంభం


ప్రారంభిస్తున్న జోనల్ హెడ్ షాలినీమీనన్

పొందూరు: మండల కేంద్రం పొందూరులో యూనియన్ బ్యాంకు నూతన శాఖను విశాఖ జోనల్ హెడ్ షాలినీ మీనన్ గురువారం ప్రారంభించారు. బ్యాంకు సేవలను విస్తృతపరచడంలో భాగంగా జిల్లాలో రెండు శాఖలను ప్రారంభించినట్టు ఆమె తెలిపారు. యూనియన్ బ్యాంకు శాఖ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులు, వాండ్రంగి సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు బూరాడ రమణ, కె.సాయికుమార్, జేవీఆర్, బాడాన గిరి, ఏపీఎం జి.శ్యామలరావు, డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాదుస్తులతో విద్యార్థులు, హెచ్ఎం తదితరులు

ఎచ్చెర్ల: డి.మత్స్యలేశం జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో చురుకుగా ఉన్న విద్యార్థులకు క్రీడాదుస్తులను పేరెంట్స్ కమిటీ చైర్మన్, గ్రామ యువకులు గురువారం వితరణ అందజేశారు. 25 మంది క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు. హెచ్ఎం బి.త్రినాథరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణదాస్

- సమావేశానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు డుమ్మా

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కొనసాగిస్తూ ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారు. శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకుడిగా ఆమదాలవలస మాజీ ఎమ్మె ల్యే తమ్మినేని సీతారాం నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని జగన్ క్యాంప్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమయ్యారు. ఇదిలాఉండగా జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరుకాలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ అధికారం కోల్పోయిన నాటి నుంచి ధర్మాన ప్రసాదరావు పార్టీ నాయకులకు ముఖం చాటేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు ఇంట రచ్చ చేసి పార్టీ సమావేశానికి హాజరుకావడంతో ఆయనపై అధినేత క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని అంతా ఊహించినా.. కనీసం దువ్వాడను ప్రశ్నించకపోవడంపై పార్టీ నాయకులతో పాటు టెక్కలి శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

రైల్వే డీఆర్ఎం దృష్టికి సమస్యలు


డీఆర్ఎంకు వినతి పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయంలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని రైల్వే జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు కట్టా సూర్యప్రకాష్ డీఆర్ఎంను కోరారు. గురువారం ఖుర్దా డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం హెచ్ఎస్ బాల్వాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ నుంచి లింగంపల్లి వరకు పొడిగించాలని తదితరు సమస్యలు పరిష్కరించాలని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మందస రోడ్ రైలు యూజర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులంలో బాలికల క్రీడా పోటీలు


ఖోఖో ఆడుతున్న క్రీడాకారిణులు

గార: వమరవల్లి ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వినోదిని గురుకులం ప్రిన్సిపాల్ చిట్టితల్లి వివిధ పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 350 మంది బాలికలు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ మొదలైన క్రీడాంశాల్లో బాలికలు పాల్గొన్నారు

పోరాటాల వేగుచుక్క సీతారాం ఏచూరి

పొందూరు: పోరాటాల వేగుచుక్క సీతారాం ఏచూరి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అప్పలనాయుడు అన్నారు. వావిలపల్లిపేట కూడలి లోని స్తంభాల ఫ్యాక్టరీలో కార్మికులు, వీఆర్ఏలు సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.త్రినాథ, కార్మిక నాయకులు పి.అపలనాయుడు, కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని ఐదో వార్డు పరిధిలోని అక్కివలసలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంకు వారి సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ సీఐ కె.వినోద్, ఆర్పీలు లక్ష్మీకామేశ్వరి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ లడ్డూ వేలం


లడ్డూతో శంకరరావు కుటుంబ సభ్యులు

పొందూరు: మండల కేంద్రం పొందూరు కనకలవీధిలో గల వినాయక మంటపం వద్ద ఉంచి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. వేలంపాటలో మండల కేంద్రాఆనికి చెందిన నల్లా శంకరరావు రూ.25,200 దక్కించుకున్నారు. ఈ వేలంపాటలో ఎ.భవానీ శంకర్, అనకాపల్లి గోపీనాథ్, ఎ.శ్రీను, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బీజేపీ ఏపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వారధి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్డీఏ డబుల్ ఇంజిన్ సర్కార్ పథకాలను ప్రజల కోసం చేసే కార్యక్రమాలు విజయవంతంగా ప్రజలకు చేరువ చేసే కార్యక్రమమే వారధి అని అన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కంచిలి: జెల్ కోట సెక్టారు పరిధిలో గల గోకర్ణపురంలో పోషకాహార మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రాధానత్యపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో ఇందిర సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఈశ్వరి, సరస్వతి పాల్గొన్నారు.

● **బూర్జ:** మండంలోని మామిడివలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ పి.రత్నం పోషకాహారంపై వివరించారు. పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందివ్వాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. గురువారం అరకబద్ర అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నీలవేణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** పౌష్టికాహారం తీసుకొనేవారు ఆరోగ్యవతంగా ఉంటారని రొట్టవలస సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నాంజలి తెలిపారు. గురువారం మండలంలోని కొండవలస కాలనీ, కొండవలస గ్రామంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించిం, ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



సోంపేట, ఇచ్ఛాపురంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎడ్యుకేటర్స్

సోంపేట: ఎయిడ్స్‌పై బేసిరామచంద్రాపురం గ్రామంలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ, వైసీబీ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ ఎల్.శివ, ఎం.మాధవరావు, డి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** హెచ్ఐవీ, ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలంటే ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరూ అవగామన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ వై.రవికుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆటో డ్రైవర్లుకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాకుళం అర్బన్: నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున 20వ తేది శనివారం విద్యుత్ కోత విధిస్తున్నట్టు ఆ శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక బగ్గు సరోజని ఆస్పత్రి ఏరియా, కత్తెర వీధి, రైతుబజార్, వుడా లేఅవుట్, తోటపాలెం, ఎస్‌పీటీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

● **ఎచ్చెర్ల:** ధర్మవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పొన్నాడ ఫీడర్, బొంతలకోడూరు, పొన్నాడ, కమ్మవానిపేట గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండదన్నారు.

● **ఇచ్ఛాపురం:** విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల విద్యుత్ లైన్లు మరమ్మతులు నిమిత్తం మున్సిపాల్టీ, మండల పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పి.యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మున్సిపాల్టీ పరిధిలో గల పురుషోత్తపురం, ఏఎస్ పేట, రత్తకన్నతోపాటు ముచ్చింద్ర, కేదారిపురం, మశాఖపురం, మండపల్లి గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

● **గార:** చల్లపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వారికి రూ.3వేలు నిరుద్యోగ భృతి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైనవారు పూర్తి వివరాలతో జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 29వ తేదీలోగా అందజేయాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు..

సోంపేట: బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రానికి సంబంధించి గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.మోహనరావు తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో 50శాతం పైబడి మార్కులు వచ్చినవారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4గంటలలోగా దరఖాస్తు అందించాలని కోరారు.

స్వయం ఉపాధి శిక్షణలో ప్రవేశాలు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఎలక్ట్రికల్ వైర్ ఫైరింగ్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు శిక్షణ సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో తెలుపు రంగు రేషన్ కార్డు కలిగి ఉండి 19 నుంచి 45 ఏళ్ల వయసు గల గ్రామీణ ప్రాంత యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. నెల రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణలో ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. ఉపాధి కల్పన కోసం బ్యాంకు రుణం మంజూరు చేసేలా చూస్తామన్నారు. వివరాలకు 95534 10809, 77021 80537 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్ఛాపురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, పాఠశాల ఎస్‌వో శిరీష తదితరులు పాల్గొన్నారు.

● **లావేరు:** పల్లెలు పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో గోపీబాల తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రాలు బాగా పనిచేసేటట్లు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ విశ్వేశ్వరరావు, కార్యదర్శులు ఉన్నారు.

ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు

జి.సిగడాం: తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఉపాధి పనులు చేపట్టి, బిల్లులు కూడా చెల్లించడంపై పాలఖండ్యాం సర్పంచ్ దారబోయిన రెయ్యమ్మ గురువారం ఎంపీడీవో కెనిశ్యలకు పిర్యాదుతో కూడిన వినతి పత్రం అందించారు. గ్రామ సభ తీర్మానంలో గుర్తించని పనులు ఎలా చేశారని ప్రశ్నించారు. ఈ విషయమై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వివరాలు అప్‌లోడ్ చేయాలి

ఎచ్చెర్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకుల వివరాలను కార్యకర్తలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో డోల పాపినాయుడు అన్నారు. ఎచ్చెర్లలోని మహిళా ప్రాంగణంలో ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు శరణ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని టీడీపీ నాయకుడు పిషని జగన్నాథం నాయుడు అన్నారు. గురువారం కోష్ట హైస్కూల్లో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిసిన అసిరినాయుడు, అప్పడ దొర, ఎంఈవో-2 లావణ్య పీడీలు ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

లావేరు: యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, గురువులు ఉన్నారు.

వినాయకుడి విగ్రహం ఊరేగింపు


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలోని లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. సహస్ర కలశ స్నపన కార్యక్రమం నిర్వహించారు. పూలతో అలంకరణ నిర్వహించారు.